# ★ దబ్బాడు బూరెద ★

కంచర్ల మాధవరావు

సుబ్బారావు పోలీసు కనిస్టేబు అయ్యాడంటే నాకు చాలా ఆశ్చర్యమేసింది. అంతేకాదు హెడ్‌కానిస్టేబుగూడ అవుతానంటున్నాడు వాడు ఎస్. ఎస్. ఎల్. సి నాలుగుసార్లు తప్పి మొన్న ఆంధ్రమెట్రిక్కు కూర్చొని అదీ తప్పి పోలీసు కానిస్టేబుగా తయారయ్యాడు బీటు మీద. యిప్పుడు నాకాశ్చర్యం వేసేది అదికాదు యూనిఫారం వేసుకొని తిరుగుతూంటే వాడి టోపీమీద నారింజపండు తొక్క [కచ్చితంగా అర్ధగోళాకారంగా కోసివున్నది] పెట్టివున్నది. ఆరవ జార్జి కిరీటంపైన టోపిపెలాగున్నది ఆ సంగతి తెలీక అట్లాగే నడుస్తున్నాడు సుబ్బారావు. ఎవరు పెట్టారో? నేను వెళ్ళి వాడితో చెప్పుదామని అనుకుంటూండగనే మోటారుసైకిల్ చప్పుడైంది రోడ్డుమీద నేను వెనక్కి తిరిగి చూచేటప్పటికి ఎవరోకాదు సబిన్‌స్పెక్టరు రామారావునాయుడు వస్తూన్నాడు. సుబ్బారావుగాడి కొంప మునిగిందిరా అనుకున్నా మనస్సులో సబిన్‌స్పెక్టరు రామారావు నాయుడు దూరం నుంచే చూచేడు సుబ్బారావు ఎర్రటోపీమీద నారింజతొక్క. వెంటనే ఎలుగుబంటిలాగా రంకె వేశాడు.

"ఒరేయ్ మూడొందల మూడు ఏమిరా అంత వొళ్ళు దగ్గరలేకుండా నడుస్తున్నావు? టోపీమీద అదేమిట్రా?" అని అర్చాడు.

సుబ్బారావు అసలు మొదటి కేకకే వులిక్కిపడ్డాడు. ఇక సబిన్‌స్పెక్టరు రామారావునాయుణ్ణి చూడగనే వణుకుడు ప్రారంభమైనది టోపీ తీసి నారింజ తొక్క చేతిలోకి తీసుకున్నాడు.

"ఎవ్వ. ఎవ్వరో పెట్టారండీ... నాకు తెలీదండీ ..." అని అనగల్గాడు.

"వెధవ వొళ్ళుదగ్గర వుంచుకో హెడ్ చేద్దామనిఅనుకుంటూంటే...." అని అంటూ సైకిల్ మోటారుమీద వెళ్ళిపోయాడు రామారావు నాయుడు.

నేను వెంటనేవెళ్ళి వాణ్ణి కలుసుకుని "ఏరా సుబ్బారావ్ ఏమిటి సంగతి? అని అడిగా

"ఇదంతా ఆ వెంకయ్యగాడి పనేరా" అన్నాడు.

"ఏ వెంకయ్య" అని అడిగాను

వాడేరా దరిద్రుడు నేను చేరినప్పట్నుంచి నన్నేడిపిస్తున్నాడు. మొన్న నేను కుర్చీలో కూర్చొని నిద్రపోతుంటే నాకు తెలీకుండా నా షూ లేసులు రెండు ముడేశాడు. బైటికి వెళ్ళి విసిల్ వేశాడు. నేను వులిక్కిపడి లేచి నుంచుం దేటప్పటికి బోర్లబొక్కల పడ్డాను. వాడు నవ్వుతూ కూర్చున్నాడు.. వుండరా వాడి పని పట్టిస్తానుండు." అని మొత్తుకోసాగాడు

"వెంకయ్య అంటే ఎల్లప్పుడూ గొడుగు పట్టుకొని తిరిగే లఫంగు వెధవ గదరా" అని అడిగాను

"ఔనురా వాడే" అన్నాడు.

"అయితే మాంచి వుపాయం చెప్తారా విను" అని వాడి చెవిలో మంత్రం వుపదేశించాను. "సాయంకాలం అరింటికి నేనుగూడా వస్తా నవ్వటానికి యిద్దరం కలసి వాణ్ణి దివానా చేద్దాం" అని చెప్పి నే నింటికొచ్చా.

టకాయించి ఆరుకొట్టేసరికి నేను పోలీసు స్టేషనుకు బయలుదేరాను. ఆకాశం అంతా మబ్బు కమ్ముతోంది. నల్లటి మేఘాలు వేగంగా వస్తున్నాయి. నా కెందుకో మేం వేసిన ప్లాను ఫెయిలవుతుందేమోనని అనిపించింది.

స్టేషనుకు వెళ్ళగనే సుబ్బారావు నన్ను కలుసుకుని ఒక మూలనున్న గొడుగు చూపెట్టాడు.

"అదేరా వెంకయ్యగాడి గొడుగు నువ్వు చెప్పినట్లు ఒక దబ్బా బూటిదెపోశాను అందులో" అన్నాడు. కాసేపటి వరకు మేం ముసిముసి నవ్వులు నవ్వాము

ఇంతలోనే రామారావునాయుడు గొంతు వినబడ్డది.

"ఏమయ్యోయి వెంకయ్యా నీ గొడుగు కాస్తయ్యి మరిచిపోయింది. వానకురిసేటట్లున్నది రేపు యింటికొచ్చి తీసికెళ్ళవులే" అనే ఎలుగుబంటి అరుపు వినబడ్డది.

మా యిద్దరి గుండెల్లో గాలాలు పడ్డాయి.

ఇంతలో సబిన్‌స్పెక్టరు రామారావునాయుడే వచ్చి మూలపెట్టివున్న గొడుగు తీసుకోబోతున్నాడు.

మా సుబ్బారావు అడ్డువెళ్ళాడు.

"ఒద్దండి .. ఒద్దండి .. ....ఆ గొడుగు నాదండి . . మళ్లీ వానకురవలేదులెండి. ..." అని చప్పరించాడు.

రామారావు నాయుడు తెల్లబోయాడు,

"పిక్కేదో తిక్కవున్నట్లుంది. ఆ గొడుగు తీసుకుంటే ఏమౌతుంది, నీవు నీ బీటుకి బజారికి వెళ్లు" అంటూ గొడుగు చేతబుచ్చుకొని బైటికి వెళ్లిపోయాడు

మేమిద్దరము గాడిదల్లా ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూచుకున్నాము. కాస్సేపటికి సుబ్బారావిట్లా అన్నాడు,

"ఇయన కొంప చేరుకునేంతవరకు వానకురవకుండా వుంటే పదివేలు. ఆయన ఇంటికి నేనొకసారి వెళ్ళి ఆయనకి తెలియకుండానే గొడుగుతీసికొన రావచ్చు."

సబిన్‌స్పెక్టరు రామారావు నాయుడు ఇంటికి చేరేంతవరకు వాన కురవగూడదని మేమిద్దమిద్దరం ఘోరమైన జపం మొదలెట్టాం కాని పైన తుపానులాగా నల్లటి మేఘాలు వస్తూనే వున్నాయి. రామారావు నాయుడు ఇంటికి చేరక ముందే వాన కురిసినట్లయితే ఆయన విడుదలచేసే తుఫాను ముందు ఈ తుఫాను ఆగలేదు

ఒక్క అరగంటసేపు జపం చేశాము. మా తపోమహిమచే అప్పటి వరకూ వాన కురవనే లేదు.

ఈపాటికి ఆయన ఇల్లుచేరుకునే వుంటాడులే అని మేమిద్దరం సబిన్‌స్పెక్టరు గారి కొంపకు బయలు దేరాం.

పదినిమిషాల్లో చేరేం.

మేం చేరి బైట వసారాలో తారట్లాడుతూంటే గేటు తెరచుకొని ఎవరు వచ్చారో తెలుసా సాక్షాత్ రామారావు నాయుడుగారే! మమ్మల్ని వెంటనే పోల్చాడు.

"ఒరేయి మూడొందలమూడు. ఇక్కడేం చేస్తున్నావ్? నీబీటు బజారులోగా ....... ..." అని గర్జించాడు.

అదృష్టవశాత్తు ఆయన ఇల్లు బజారుపోయే తోవలోనే.

"బజారే...... పోతున్నాను.... ......సార్ మీ దొడ్లోపేదో... ...శబ్దమైతే .. ....చూట్టానికి వచ్చానండీ ..." అని వణుకుతూ చెప్పాడు జవాను.

"ఓరి దౌర్భాగ్యుడా! కరెంటుపోయి చీకట్లో ఇప్పుడే నేను బజారునుంచి వస్తూంటే ఎవ్వరో ఇద్దరు దొంగలు నన్ను పట్టుకొని నాటోపీ, చేతిలోవున్న గొడుగూ, జేబులో మనీపర్సు కొట్టేశారు. నేను విసిల్ వేస్తే నువ్వొంటేగా... రావటానికి రేపు పేపనికిరా.... నీ పని పట్టిస్తాను. ఇప్పుడు పో .... .. '' అని వూరంతా వినేటట్లు చీవాట్లు పెట్టేడు. ఇప్పుడు అసలు ఉగ్రుడై కొట్టేంత ఊపరులో వుండేటప్పటికి "పో" అని అనగనే మేమిద్దరం ఒక్కొక్కసారిగా గంతేసి బైట పడ్డాం.

ఇంటికి బయలుదేరాం. త్రోవలో సుబ్బారావు ఏడ్వటం మొదలెట్టాడు. "మనమేంచేస్తాం . అంతా కర్మరా" అని నేనేవేవో చెప్పాను.

ఇంతలో పెళా.......పెళా—........మని ఉరుముతూ వర్షించసాగింది. మాముందే పోతూన్న ఇద్దరు వ్యక్తులలో ఒకాయన గొడుగు విప్పాడు. తక్షణం ఆయన నెత్తిన డబ్బాడు బూడిదె రాలింది!!

మా సుబ్బారావు ఒక్కసారిగా ఎలుగెత్తి "వీడేరా" అని కేకేసి అమాంతంగా ఆయన్ని కావలించుకున్నాడు. ఆయన ప్రక్కనున్న ఆయన్ని నేను కాటేసుకున్నాను. ఇద్దర్ని స్టేషనుకు లాక్కెళ్లాం. మనీపర్సూ టోపీ వగైరాలు వాళ్ళ దగ్గరే దొరికాయి....—

బూడిదె ఏ మాత్రం కన్పడకుండా వుండేందులకై రాత్రంతా గొడుగు చచ్చేటట్లు దులిపాం.

తెల్లారు ఝామున మా సుబ్బారావు సబిన్‌స్పెక్టరు రామారావు నాయుడుగారికి పర్సూ, గొడుగూ, టోపీ....దొంగల్ని అప్పజెప్పాడు.